నేనూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినే

- విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యం పెట్టుకోవాలి
- విద్యార్థులకు సన్మానంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ) : విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యం ఏర్పాటుచేసుకొని.. ఆ దిశగా ముందుకుసాగాలని డీజీపీ జితేందర్ సూచించారు. తానూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి డీజీపీ స్థాయికి ఎదిగినట్టు తెలిపారు. గురుకులాల్లో ప్రవేశం పొందిన 68మంది నిరుపేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో అక్షయ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీజీపీ జితేందర్ సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థి దశ ఎంతో అమూల్యమైందని, ఈ సమయంలో చెడుఅలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అక్షయ విద్య స్థాపకుడు వరప్రసాద్, సలహాదారు, ఐజీ ఎం రమేశ్, ఇండియా సీఎస్ఆర్ హెడ్ మిచెల్లే డొమినికా, ఫౌండేషన్ స్థాపక ట్రస్టీ జనార్దన్, అకడమిక్ అడ్వైజర్ అరుంధతి, హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్‌చౌహాన్ పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సెలింగ్ రిజర్వేషన్లను సరిదిద్దాలి

మంత్రి రాజనర్సింహకు బీసీ నేతల వినతి

హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌కు అనుసరిస్తున్న రిజర్వేషన్లు పూర్తిగా అసంబద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే సరిదిద్దాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. పలువురు బీసీ సంఘాల నేతలతో కలిసి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శనివారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న అక్రమాలపై చర్చించారు. కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు విధానం లోపభూయిష్టంగా ఉందని, ఏటా 300 మంది సీట్లు కోల్పోతున్నారని వివరించారు. కృష్ణ, రామకృష్ణ, రాజేందర్, అనంతయ్య, సతీశ్, శంకర్, నిఖిల్, బలరామ్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

ట్రిపుల్ ఆర్‌కు మా భూములియ్యం

అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

తేల్చి చెప్పిన గిర్మాపూర్, పెద్దాపూర్ రైతులు

సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

సంగారెడ్డి, ఆగస్టు17 : ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పారు. శనివారం సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏర్పాటు చేసిన సమావేశాన్ని కొండాపూర్ మండలం గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్ రైతులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. అంతకు ముందే ఆయా గ్రామాల్లో ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చేది లేదంటూ గ్రామస్థులంతా ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే ఆయా గ్రామాల మీదుగా జాతీయ రహదారి, పెద్దాపూర్ ఫిల్టర్‌బెడ్, మంజీర పైపులైన్, చెరువులు, కాల్వల నిర్మాణానికి భూములు తీసుకుని తమను కూలీలుగా మార్చారని మండిపడ్డారు. ఇప్పటికే నాందెడ్-అకోలా జాతీయ రహదారి శివ్వంపేట నుంచి కంది ఐఐటీ వరకు వెళ్తున్నదని చెప్పారు. ఈ రోడ్డును చింతల్‌పల్లికి జతచేయడంతో చింతల్‌పల్లి, తాళ్లపల్లి, కల్పగూర్, కులబ్‌గూర్, ఇరిగిపల్లి, గిర్మాపూర్, పెద్దాపూర్‌లో భూసేకరణ మిగిలిపోతుందన్నారు. ప్రభుత్వానికి బడ్జెట్ మిగులుతుందని, ఈ విషయాన్ని గుర్తించి గిర్మాపూర్-పెద్దాపూర్ నుంచి అలైన్‌మెంట్ మార్చాలని వారు కోరారు. వీరికి రైతు సంఘాల నాయకులు జయరాజు, పృథ్వీరాజ్, టీజేఎస్ తుల్జారెడ్డి మద్దతిచ్చారు.

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా గాంధీ దవాఖానలో నిరసన తెలుపుతున్న వైద్యులు

కదం తొక్కిన వైద్యులు

- కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై పెల్లుబికిన నిరసనలు
- రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలు బంద్
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ) : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు కదం తొక్కారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపు మేరకు ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో శనివారం ఓపీ సేవలు బంద్ చేశారు. వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లు భారీ ర్యాలీలు తీశారు. హైదరాబాద్ ధర్నాచౌక్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో డ్యూటీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ ఈ ఘటనను ఖండిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కఠినంగా వ్యవహరించి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. వైద్యుల ధర్నాలకు వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, కార్యదర్శి కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిర్లక్ష్యం వహిస్తూ హంతకులను కాపాడే ప్రయత్నం చేస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పేర్కొన్నారు.

గ్రామాస్థాయిలో రెవెన్యూ అధికారి ఉండాలి

రైతు సంఘం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): భూసంబంధిత వివరాల సేకరణకు, ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడానికి గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారిని నియమించాలని పలువురు వక్తలు కోరారు. గ్రామాలవారీగా రికార్డులు తయారు చేసి, డిజిటలైజ్ తోపాటు మ్యానువల్ కూడా రూపొందించాలని సూచించారు. పహాణీ, కాస్తు కాలం కొనసాగించాలని కోరారు. తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు-2024పై తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని వైవీ కృష్ణారావు రైతుభవన్‌లో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ రంగ నిపుణులు నరసింహారెడ్డి, హైకోర్టు న్యాయవాదులు వేణుగోపాల్, రాజ్‌రెడ్డి, గోకుల్, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, సామాజిక కార్యకర్త సాధిక్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు

జియో రిఫరెన్సింగ్

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన భూములు, ఇతర స్థిరాస్తులను జియో రిఫరెన్సింగ్ మ్యాపింగ్ ద్వారా సంరక్షించనున్నట్టు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ భూముల జోలికి ఎవరూ రాలేని పరిస్థితిని తీసుకొచ్చేందుకే ఈ విధానాన్ని అనుసరించనున్నట్టు తెలిపారు. ఖైరతాబాద్‌లోని తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టీజీరాక్) సంస్థ కార్యకలాపాలపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయోగాత్మకంగా ఆర్టీసీ, హోంశాఖ భూముల కోసం జియో రిఫరెన్సింగ్ మ్యాపింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. టీజీ రాక్ ఏడీజీ మనోహర్, అర్థగణాంక శాఖ డైరెక్టర్ రుఫస్, నరసింహాచారి, శివప్రసాద్ పాల్గొన్నారు.

కులగణన చేయకుంటే సర్కారుపై యుద్ధమే

- సాధనే లక్ష్యంగా ఈ నెల 22 నుంచి ఉద్యమం
- వచ్చేనెల 6న హైదరాబాద్ దిగ్బంధం: జాజుల

రవీంద్రభారతి,ఆగస్టు17: సమగ్ర కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. కులగణన సాధనే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందాల గణేశాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజుల మాట్లాడారు. ఈ నెల 22న అఖిలపక్ష పార్టీల సమావేశం, 26 జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, సెప్టెంబర్ 6 లక్షలాది మంది బీసీలతో హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధిస్తామని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరించి బీసీ కులగణన ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ చెప్పిన కులగణన బూటకమని, ఆయన మాటకు ఆ పార్టీలో విలువేలేదని పేర్కొన్నారు. ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, ప్రాణత్యాగానికి వెనుకాడబోమని జాజుల స్పష్టం చేశారు. బాల్‌రాజ్ గౌడ్, వేముల వెంకటేశ్ పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

స్వచ్ఛ్ బయోకు ఎలాంటి హామీ ఇవ్వలేదు

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ): అమెరికా పర్యటనలో భాగంగా స్వచ్ఛ్ బయో సంస్థకు ప్రయోజనం కల్పించే ఎలాంటి హామీని తాము ఇవ్వలేదని పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. తాము సంతకం చేసింది జెనరిక్ ఎంవోయూ మాత్రమేనని చెప్పారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తమ విదేశీ పర్యటన వివరాలను మంత్రి వెల్లడించారు. స్వచ్ఛ్ బయో సంస్థ ఇటీవల ఏర్పడి ఉండవచ్చు కానీ అది సుగనిత్ రెన్యూవబుల్స్‌తో అధికారిక భాగస్వామ్యంలోకి ప్రవేశించిందని తెలిపారు. 9 రోజుల తమ పర్యటన విజయవంతమైందని, 25కంపెనీలతో రూ. 36వేల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని చెప్పారు.

ఐపీవో పేరుతో 5 కోట్లు లూటీ

సైబర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు ● ఇద్దరు నిందితుల అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): బంగారం కంపెనీ ఐపీఓకి వచ్చిందని, పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ఆశచూపి.. ఓ వ్యక్తి నుంచి రూ.5.40 కోట్లను లూటీ చేసిన ఇద్దరు అన్నదమ్ములను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) అధికారులు అరెస్టు చేసినట్లు శనివారం సీఎస్‌బీ డైరెక్టర్, డీజీ శిఖాగోయెల్ తెలిపారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లికి చెందిన ఓ వ్యక్తి కేరళలో రూ.8.5 కోట్లకు పైగా అప్పుతో రెండు చారిటబుల్ ట్రస్ట్‌లను నిర్వహిస్తున్నాడు. అతనికి ట్రేడింగ్‌పై అవగాహనతో 8918520578 నంబర్ నుంచి వాట్సాప్‌తో "B6/Stock Visionaries" ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపులో జూన్ 8న యాడ్ చేయబడ్డాడు. అప్పటికే ఆ గ్రూప్‌లో కొందరు లాభాలు వస్తున్నాయని మెసేజ్‌లు చేస్తుండటంతో నిజమేనని నమ్మాడు. అనంతరం లిడియా శర్మ అనే మహిళ 'గోల్డ్ మన్ సాక్స్' అనే ఇండియా కంపెనీ ఐపీవోకు సిద్ధంగా ఉందని, దాంట్లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయిని మెసేజ్ చేసింది. స్పందించిన ఫిర్యాదుదారుడు.. ఆమెకు మెసేజ్ చేశాడు. ఆమె సూచన మేరకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభించి జూలై 10న రూ.30వేలతో ప్రారంభించి జూలై 25 నాటికి రూ.5,40,47,000 పెట్టాడు. వాటిని విత్‌డ్రా చేసుకునే ప్రయత్నంలో సైబర్ మోసగాళ్లు మరింత పెట్టాలని ఆదేశించడంతో.. మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసులో కీలకంగా వ్యవహరించిన రాంపిల్ల కొండల్‌రావు, చంద్రశేఖర్ ఆజాద్‌ను విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

మార్గదర్శకాల పేరిట మోసం

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఆగస్టు 17: అర్హులందరికీ రుణమాఫీ చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆవేదన చెందారు. మార్గదర్శకాల పేరిట రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని ఆరోపించారు. గంగాధర మండలం మధురానగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఏకకాలంలో ₹2 లక్షలు రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి మార్చారని ధ్వజమెత్తారు. మొదట 45 లక్షల మంది రైతులకు ₹40 లక్షల కోట్లు మాఫీ చేస్తామని చెప్పి ఆ తర్వాత ₹31 వేల కోట్లు అని, ఆ తర్వాత ₹18 వేల కోట్లు అని చెప్పి చివరికి ₹17,900 కోట్లు మాత్రమే మాఫీ చేశారని పేర్కొన్నారు. మూడు దఫాల్లో 40 శాతం మంది రైతులకే మాఫీ వర్తించిందని, మరో 60 శాతం మందికి మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నట్టు తెలిపారు. గంగాధర మండలంలోని గట్టుభూత్కూర్‌కు చెందిన బొడ్డు పద్మ అనే మహిళ ₹30 వేల రుణం తీసుకుంటే ₹6 వేల వడ్డీ అయ్యిందని, వడ్డీ కడితేనే ₹30 వేలు మాఫీ చేస్తామని బ్యాంకు అధికారులు చెప్పారని తెలిపారు. మిత్తితో కలిపి ₹2 లక్షల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కొడిమ్యాల మండలం పూడూర్‌లో 680 మంది అర్హులుంటే 142 మందికి మాత్రమే మాఫీ జరిగిందని తెలిపారు. అర్హులందరికీ మాఫీ చేయకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మతిలేకుండా, సీఎం రేవంత్‌రెడ్డి సోయి లేకుండా బీఆర్ఎస్ పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 60 లక్షల సభ్యత్వం ఉన్న బీఆర్ఎస్ పార్టీని విలీనం చేస్తారని చెప్పడం వారి అవగాహన లేమికి నిదర్శనమన్నారు. అసత్య ప్రచారాలను మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు వేముల దామోదర్, కంకణాల విజేందర్‌రెడ్డి, రామిడి సురేందర్, యండీ నజీర్, తోట మహిపాల్, శ్రీమల్ల మేఘరాజు, వడ్లూరి ఆదిమల్లు, ముక్కెర మల్లేశం పాల్గొన్నారు.

విజిబుల్ పోలీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి

- నేర సమీక్ష సమావేశంలో సీపీ మహంతి

కరీంనగర్ రాంనగర్, ఆగస్టు 17 : కమిషనరేట్ పరిధిలో విజిబుల్ పోలీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సీపీ అభిషేక్ మహంతి పోలీస్ అధికారులకు సూచించారు. శనివారం కమిషనరేట్ కేంద్రంలో అన్ని విభాగాల అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామ సందర్శన, నగరంలో వార్డుల సందర్శన పెరగాలన్నారు. స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకోవాలన్నారు. డయల్ 100 ద్వారా వచ్చే ప్రతీ ఫిర్యాదును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రజలను మోసం చేసే వారిపై కచ్చితంగా షీట్లను తెరవాలని సూచించారు. వయసు మళ్ళిన, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారిని, కొన్నేళ్ల పాటు సత్ప్రవర్తనతో మెదిలే వారిని గుర్తించి వారిపై షీట్‌లను సమీక్షించి తొలగించాలన్నారు. ఘటనకు అనుకూలంగా నమోదు చేసే సెక్షన్ల విషయంలో సందేహాలు ఏర్పడితే సీఐడీ విభాగ ఆధీనంలో ఏర్పాటు చేసిన ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెల్ ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. గంజాయిని అరికట్టేందుకు ఇప్పటికే కమిషనరేట్ స్థాయిలో ప్రత్యేకంగా నార్కోటిక్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామని, దాని సహాయంతో క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టి ఎన్‌డీపీఎస్ ఆక్ట్ ద్వారా కేసులు నమోదు చేయాలని సూచించారు. సైబర్‌నేరాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. డివిజన్‌ల వారీగా రోడ్డు ప్రమాదాల పై సమీక్ష చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌ల వారీగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు , అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. అక్రమ ఇసుక రవాణా , పీడీఎస్ బియ్యం , పేకాట స్థావరాలను గుర్తించి ఉక్కు పాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్ (సీఎస్‌బీ), నరేందర్, వెంకటరమణ, విజయ్ కుమార్, కాశయ్య. సర్కిల్ ఇన్ స్పెక్టర్లు, ఎస్ ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ చీకటి రాజకీయం

- విలీనం అంటూ బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం
- మాజీ మంత్రి కొప్పుల

కార్పొరేషన్, ఆగస్టు 17: బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ కాంగ్రెస్, కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అంటూ బీజేపీ నాయకులు ప్రకటనలు గుప్పిస్తూ రెండు పార్టీలు చీకటి కుట్రలు చేస్తున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన హామీలు ఆ రెండు పార్టీలు నెరవేర్చకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలకు గులాబీ జెండా అంటే వణుకు పుడుతోందని, పార్టీ పుట్టినప్పుడు 100 మంది హిట్లర్లే బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను ఏం చేయలేకపోయారని, వీరి పిట్ట బెదిరింపులను ఎవరూ పట్టించుకోరని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మీద విషం చిమ్మే ప్రకటనలను తెలంగాణ సమాజం నమ్మదని పేర్కొన్నారు. 2001లో టీఆర్ఎస్ పార్టీ ఒక విత్తనమని, విత్తనాన్ని చంపాలని అనేక ప్రయత్నాలు చేశారని, ఇప్పుడు ఆ విత్తనమే మహావృక్షమై తెలంగాణ ప్రతి పల్లెకు వేర్లు విస్తరించాయన్నారు. తెలంగాణ పైన కేసీఆర్‌పై బరితెగింపు మాటలు మానుకోవాలన్నారు. కేసీఆర్ ఆరోగ్యం పై రెండు దశాబ్దాలుగా చిల్లర ఆరోపణలు చేస్తున్నారని, వారి తిట్లే ఆయనకు మెడిసిన్ అని అన్నారు. భూమి, ఆకాశం ఉన్నంతవరకు తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు. జాతీయ ప్రాంతీయ పార్టీలతో పోల్చితే తాము అందనంత ఎత్తులో ఉన్నామన్నారు.

సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బంది పెడుతరా?

- విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం

ప్రిన్సిపాల్ మంజులతో వాగ్వాదానికి దిగిన తల్లిదండ్రులు

గంగాధర, ఆగస్టు 17: ''పాఠశాలలో కనీస వసతులు కల్పించకుండా తమ పిల్లలను ఇబ్బంది పెడుతారా?'' అంటూ గంగాధర మండలంలోని జోత్యబాపూలే బాలికలు గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిపై శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తమ పిల్లలను ఇండ్లకు తీసుకువెళ్లడానికి కొంతమంది తల్లిదండ్రులు ఉదయం 10 గంటలకు పాఠశాలకు వచ్చారు. కొంత మంది పిలల్లకు ఎలర్జీ అయ్యిందని, కోతులకు భయపడి పరిగెత్తడంతో కొందరికి గాయాలయ్యాయని, సిబ్బంది సరిగా చూసుకోకపోవడంతో తామైనా దవాఖానకు తీసుకెళ్తామని చెప్పినా ఉపాధ్యాయులు వినిపించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు గంటల పాటు పాఠశాల ఎదుట నిరీక్షించినా సామాధానం చెప్పకుండా డోర్‌లాక్ చేశారని ఆరోపించారు. కాగా, వసతిగదుల్లో ఫ్యాన్లు లేక దోమలతో రాత్రులు నిద్ర పోవడం లేదని, డైనింగ్ హాల్ లేక బాత్రూముల దగ్గరలో నేలపై కూర్చొని భోజనాలు చేస్తున్నట్లు పిల్లలు వాపోయినట్లు తెలిపారు. రక్షణ గ్రిల్స్ లేక కోతుల వస్తున్నాయని, వాటికి భయపడి పరిగెత్తి గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరిపడా బాత్రూంలు లేకపోవడంతో 5, 6, 7వ తరగతి విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేస్తున్నారని వాపోయారు. రాఖీ పౌర్ణమికి పిల్లలను పంపించడానికి అనుమతులు లేవని, పై అధికారులతో మాట్లాడి పంపిస్తామని తెలిపారు.

జాతీయ సైన్స్ వర్క్ షాప్‌నకు ఓదెలు కుమార్

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 17 : సీఎస్ఆర్ రావు సైన్స్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ యూనిట్, జవహర్ లాల్ నెహ్రూ సెంటర్ ఇండియన్ నేషనల్ సైన్స్ బెంగళూరులో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి సైన్స్ వర్క్ షాప్‌నకు కరీంనగర్ జిల్లా ఇందుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు భాషా బత్తిని ఓదెలు కుమార్ ఎంపికయ్యాడు. బెంగళూరులో ఈ నెల 20, 21 తేదీల్లో కెమికల్ సొసైటీ ఆఫ్ థాయిలాండ్, బ్యాంకాక్ పబ్లిక్ కంపెనీ సౌజన్యంతో నిర్వహించనున్న ఈ వర్క్ షాప్‌లో ఆయన పాల్గొంటారు. జాతీయ వర్క్ షాప్‌నకు ఎంపికైన ఓదెలు కుమార్‌ను జిల్లా విద్యాధికారి సీహెచ్ జనార్దన్‌రావు, చిగురుమామిడి మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, డీసీబీ కార్యదర్శి స్వదేశ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జయ అభినందించారు.

పశువైద్యాధికారికి జాతీయ సాహితీ పురస్కారం

- కథల పోటీల్లో కోటేశ్వర్‌రావుకు ప్రథమ బహుమతి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఆగస్టు 17: నమస్తే తెలంగాణ దినపత్రిక, ముల్కనూరు సాహితీ పీఠం సంయుక్తంగా నిర్వహిస్తున్న 2023-24 జాతీయస్థాయి తెలుగు కథల పోటీల్లో కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో సీనియర్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ ఎం కోటేశ్వరరావు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. తలపండిన రచయితలు పాల్గొంటున్న ఈ పోటీల్లో ఒక సాధారణ పశువైద్యాధికారి ప్రథమ బహుమతిని గెలుపొందటం విశేషం. ఆయనకు రూ. 50 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెమొంటోను అందుకోనున్నారు. తనకున్న సాహిత్య అనుభవం వృత్తిలో రాణించడానికి, రైతులకు వందల సంఖ్యలో సాంకేతిక వ్యాసాలు రాయడానికి ఎంతో దోహదం చేసిందని డా. కోటేశ్వరరావు తెలిపారు. ఆయనను శాఖాధికారులు, సహ డాక్టర్లు, సిబ్బంది అభినందించారు.

స్త్రీ నిధి జిల్లా శాఖకు ఉత్తమ సేవా అవార్డు

మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఇన్‌చార్జి మేనేజర్ మదార్

కలెక్టరేట్, ఆగస్టు 17 : 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన స్త్రీనిధి జిల్లా శాఖకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆ సంస్థ 11వ సర్వసభ్య సమావేశం ఇటీవల హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల ప్రొఫెసర్ జయశంకర్ ఆడిటోరియంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి చేతుల మీదుగా, ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలకు పురస్కారాలు అందజేశారు. కరీంనగర్ జిల్లా నుంచి స